
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024 | 5





కూటమితో.. జోష్

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి
- మూడు పార్టీల సమష్టి పనితీరుతో నియోజకవర్గాల్లో అభ్యర్థుల బలం రెట్టింపు
- ప్రభుత్వ వ్యతిరేకత, జనరంజక మేనిఫెస్టోతో ప్రజల్లో భారీ సానుకూలత
- దీనికితోడు పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తుండడంతో మిగిలిన స్థానాల్లోను వేవ్
- ఇప్పటికే ఐదు నియోజకవర్గాల్లో పవన్ బహిరంగసభలతో ఊపందుకున్న జోష్
- టీడీపీ, జనసేన స్పీడుతో వైసీపీ అభ్యర్థులకు కునుకు కరువు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో జిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు రెట్టించిన బలంతో దూసుకుపోతున్నారు. ఇంకా రెండు వారాల్లోపే పోలింగ్ ఉండగా గెలుపుధీమాతో ఎన్నికలరణక్షేత్రంలో ఉత్సాహంతో కదులుతున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ ప్రజల్లో కనిపిస్తున్న ఆదరణతో విజయం ఖాయమనే లెక్కలతో ముందుకుసాగుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత, అటు జనరంజక మేనిఫెస్టోపై అన్నివర్గాల్లో వస్తున్న స్పందనతో కూటమికి ప్రజల్లో ఆదరణ వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఓట్ల సమీకరణ సైతం కూటమికి కొండంత బలంగా విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

అన్నీ కలిసొస్తున్నాయి..

అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలో టీడీపీ, జనసేనలకు జీవన్మరణ సమస్యగా మారాయి. అధికారం అండతో వైసీపీ ప్రభుత్వం ఎక్కడికక్కడ ఈ రెండు పార్టీలను ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పెడుతూ వస్తోంది. రకరకాల కేసులతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలనే పట్టుదలతో జిల్లాలో కూటమి అభ్యర్థులు పోరాడుతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు విడిగా పోటీ చేయడంతో ఓట్లు చీలి వైసీపీ లాభపడింది. పెద్దాపురం మినహా అన్నిస్థానాల్లో అప్పట్లో గెలిచింది. కాకినాడ సిటీలో జనసేనకు 2019 ఎన్నికల్లో 30,188పోలవగా, టీడీపీకి వచ్చే ఓట్లు చీలిపోయి వైసీపీ ఎమ్మెల్యేగా ద్వారంపూడి 14,111ఓట్లతో గెలిచారు. కాకినాడ రూరల్‌లో జనసేనకు అప్పట్లో 40,001 ఓట్లురాగా, వైసీపీ ఎమ్మెల్యేగా కన్నబాబు ఓట్లు చీలడంతో 8,788 ఓట్లతో నెట్టుకొచ్చారు. పిఠాపురంలో జనసేనకు 28,001 ఓట్లు రాగా, వైసీపీ ఎమ్మెల్యేగా దొరబాబు 14,992 ఓట్లతో గెలిచారు. ప్రత్తిపాడులో జనసేనకు 6,907ఓట్లు రాగా, వైసీపీ ఎమ్మెల్యే పర్వతప్రసాద్ 4,666 ఓట్లతో గెలిచారు. తునిలో 6,413, జగ్గంపేటలో 10,649 ఓట్లు జనసేనకు పోలయ్యాయి. ఈ ఓట్లు టీడీపీకి చీలడంతో ఇక్కడ కూడా వైసీపీ అభ్య ర్థులు గెలిచారు. కానీ ఈసారి టీడీపీ, జనసేన జట్టు కట్టడంతో ఓట్ల చీలిక భయం లేకుండాపోయింది. పవన్‌కళ్యాణ్ పిఠాపురంనుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఆయన తన ప్రచారం చేసుకుంటూనే పార్లమెంట్ పరిధిలో అన్నిస్థానాల్లో రోడ్డు షోలు, బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడసిటీ, తుని నియోజ కవర్గాలు మినహా ఐదు నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి చేశారు. దీంతో పవన్ పోటీ ప్రభావం జిల్లాలో మిగిలిన అభ్యర్థులకు అన్ని రకాలుగా కలిసివస్తోంది.

ఎదుర్కోవడమెలాగో..

ఎన్నికల ప్రచారంలో అధికార వైసీపీ ఉక్కపోతకు గురవుతోంది. ఆ పార్టీ అభ్యర్థులు జనంలోకి వెళ్తున్నా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిరోజుల వ్యవధిలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థులు ద్వారంపూడి, కన్నబాబుపై మత్స్యకారులు తిరగబడ్డారు. పిఠాపురంలో వంగా గీతకు మహిళలు చుక్కలు చూపించారు. ప్రత్తిపాడులో వరుపుల సుబ్బారావు తరఫున వెళ్లిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుపై జనం తిరగబడి తరిమికొట్టారు. సీఎం జగన్ సిద్ధం బస్సు యాత్ర జనం లేక వెలవెలబోయింది. ఈ నేపథ్యంలో డబ్బు, మద్యం పంపిణీపైనే వైసీపీ ఆశలు పెట్టుకుంది. దీనికి నిదర్శనమే ఇటీవల కాకినాడ సిటీ, పిఠాపురంల్లో పట్టుబడ్డ రూ.1.80 కోట్ల విలువైన గోవా మద్యం డంప్‌లు. ఇవి బయటపడడంతో నియోజకవర్గాల్లో ఓటమి భయంతో అధికారపార్టీ ఎన్ని అడ్డదారులు తొక్కుతుందనేది బహిర్గతమైంది.

పింఛన్.. కష్టాలు
పెంచెన్

మండుటెండలో వడగాడ్పులు తట్టుకుంటూ కిలోమీటర్ల కొద్ది ప్రయాణం. బ్యాంకుల వద్ద తమ వంతు వచ్చేవరకూ పడిగాపులు. మీ ఖాతాలు మనుగడలో లేవు. ఈ పత్రాలు తెస్తే ఆన్‌లైన్ చేసి అప్పుడు డబ్బులు ఇస్తామంటూ సిబ్బంది సమాధానం. మరికొందరికి మీ అకౌంట్‌లో పడిన సొమ్ముల్లో చార్జీలు, బ్యాంకు రుసుములు పోగా ఇంతే మిగిలింది అంటూ చెబుతుండడంతో లబ్ధిదారులకు ఏమీ అర్థంకాని పరిస్థితి. ఇంటింటికి పింఛన్లు ఇవ్వకుండా తమను తీవ్ర అగచాట్లకు గురిచేస్తున్నారంటూ వైసీపీ ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల ఆవేదన.. ఇదీ గురువారం ఉమ్మడి జిల్లాల్లో కనిపించిన దృశ్యాలు.

గంటలకొద్దీ పడిగాపులు



గొల్లప్రోలులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద పెన్షన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

పిఠాపురం, మే2: కాకినాడ జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా అన్ని రకాల పింఛన్లు పొందేవారు 2 లక్షల 80 వేల 662 మంది ఉన్నారు. వీరికి పింఛన్లు రూపేణా రూ.83.16 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. లబ్ధిదారుల్లో 25 శాతం మందికిపైగా బ్యాంకు ఖాతాలు లేవు. అయినా లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం నగదు జమచేసింది. దీంతో బుధవారం ఉదయమే కాకినాడ జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న బ్యాంకుల వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. బ్యాంకుల వద్దకు ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్న లబ్ధిదారులు రెండు గంటలకు పైగా పడిగాపులుపడ్డారు. జిల్లా కేంద్రమైన కాకినాడతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం పట్టణాలు, జగ్గంపేట, ఏలేశ్వరం, కొత్తపల్లి, రౌతులపూడి తదితర మండలాల తోపాటు గ్రామాల్లోనూ బ్యాంకుల వద్ద ఇదే పరిస్థితి.

అకౌంట్ లైవ్‌లో లేదన్నారు



పింఛన్‌కోసం కాకినాడ శ్రీనగర్ యూనియన్ బ్యాంకుకు మండుటెండలో వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత డబ్బులు పడ్డాయికానీ అకౌంట్ లైవ్‌లో లేదని ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ తీసుకొస్తే అప్పుడు చూద్దామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.

- మడక మేరమ్మ, బర్మాకాలనీ

డబ్బులు పడలేదన్నారు..



కాలికి ఆపరేషన్ చేయించుకుని నడవలేని స్థితిలో ఉన్నా. పింఛన్ కోసం కాకినాడ కల్పన సెంటర్ యూనియన్ బ్యాంక్‌కు స్టిక్ సాయంతో వచ్చాను. తీరా లైన్లో నిలబడి కౌంటర్ దగ్గరికి వెళ్లేసరికి బ్యాంకులో డబ్బులు పడలేదన్నారు. ఏం చేయాలో తెలీక తిరిగి ఇంటికి వెళుతున్నా.

- పదాల సూరమ్మ, డెయిరీఫారం సెంటర్

వేసవిలో ఎంత ఇబ్బందో గుర్తించాలి



ప్రతీనెలా ఇంటి వద్ద ఇచ్చేవారు. ఇప్పుడు బ్యాంకుకి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులుపడ్డాం. వయస్సు పైబడినవారు ప్రస్తుత వేసవిలో బయటకు రావడం ఎంత ఇబ్బందో ప్రభుత్వం గుర్తించాలి. ఇకనైనా పింఛన్లు సక్రమంగా ఇచ్చే ఏర్పాటుచేయాలి.

- బాలిశెట్టి లక్ష్మి, ఏలేశ్వరం

ఆటో ఖర్చులు తప్పలేదు



ఫింఛన్ ఎక్కడ ఇస్తారనేది తెలియలేదు. నడవడానికి కాళ్లు సహకరించలేదు. గత నెల ఇచ్చినట్టు సచివాలయంలో ఇస్తారని వెళ్లా. బ్యాంకుకు వెళ్లాలన్నారు. మళ్లీ మండుటెండలో ఆటోకు రూ.200 ఇచ్చి వెళ్లాల్సి వచ్చింది. సచివాలయం వాళ్లైనా ఇళ్ల వద్దే ఇస్తే మంచిది.

- బి.తల్లెమ్మ, హంసవరం, తుని రూరల్

- కార్పొరేషన్(కాకినాడ)/ జగ్గంపేట/కొత్తపల్లి ఏలేశ్వరం/ తుని రూరల్/ ప్రత్తిపాడు/సామర్లకోట

పండుటాకులపై జగన్ పగ

- వైసీపీ ఓటు అరాజకీయం
- బ్యాంకుల వద్ద ప్రత్యక్ష నరకం
- వృద్ధులు, దివ్యాంగుల ఆపసోపాలు
- సగం మంది ఖాతాలు ఇన్‌యాక్టివ్
- పింఛను సొమ్ములో చార్జీల పేరిట కోత
- వలంటీర్లతో తెర వెనుక రాజకీయం



పిఠాపురాన బ్యాంక్‌లో పింఛనుదారుల క్యూ

(పిఠాపురం)

ఎన్నికల వేళ వైసీపీ సర్కారు తెరతీసిన కొత్త డ్రామా పింఛను లబ్ధిదారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. వలంటీర్లు ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకున్న జగన్ సర్కారుకు ఇది వరకే ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించడంతో టీడీపీ, జనసేన పార్టీల కారణంగానే మీకు ఇంటింటికీ పింఛన్లు తెచ్చి ఇవ్వలేకపోతున్నామనే ప్రచారానికి ఏప్రిల్ నెలలో జగన్ సర్కారు, వైసీపీ నేతలు తెరలేపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే అవకాశం ఉన్నా ఆ విధంగా చేయకుండా గత నెలలో అందరినీ సచివాలయాలకు రమ్మని అక్కడ పంపిణీ చేపట్టారు. దీంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెలలో ఈసీ సూచనలంటూ బ్యాంకు ఖాతాలకు నగదు జమచేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులను అగచాట్లకు గురిచేసింది. ఇప్పుడు మండుటెండలో చెమటలు కారుస్తూ లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నారు. దీనికి టీడీపీ, జనసేన నాయకులే కారణమని చెప్పడం ద్వారా లబ్ధిపొందే ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెలలో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు పడ్డ ఇబ్బందులు చూసిన తర్వాతైనా ప్రభుత్వంలో కదలిక వచ్చి ఇంటింటికీ పంపిణీ చేస్తారని భావించినా ఓట్ల రాజకీయం మరోలా ఆలోచింపజేసిందనే విమర్శలున్నాయి.

కనీస ఏర్పాట్లు కరవు

పింఛను సొమ్ము తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు భారీగా లబ్ధిదారులు తరలివస్తారని తెలిసినా కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో వృద్ధులు, మహి ళలు బ్యాంకుల వద్ద మండుటెండలోనే పడిగాపులు పడ్డారు. పలువురు వడదెబ్బకు గురయ్యారు. వడగాడ్పులు వీస్తాయని, బయటకు రావొద్దని వాతావరణ శాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు కలెక్టరు ప్రకటన జారీ చేసినా వృద్ధులను ఇలా మండుటెండలో తిప్పుతారా అని పలువురు మండిపడుతున్నారు. వారికి ఏమైనా అయితే బాధ్యత ఎవరిదని అంటున్నారు. మరోవైపు పలువురికి బ్యాంకు ఖాతాలు ఉన్నా సొమ్ములు జమకాలేదు. దీనికి ఎన్‌సీపీఐ (నేషనల్ పేమెంట్ పోర్టల్)తో ఆధార్ అనుసంధానం కాకపోవడం కారణమని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి బయోమెట్రిక్ వేయాలని సూచిస్తున్నారు. బ్యాంకుల వద్ద ఎలా నగదు డ్రా చేయాలి, ఉన్న ఇబ్బందులు, ఏయే పత్రాలు తీసుకురావాలి తదితర సమాచారాన్ని అందించేందుకు బ్యాంకు సిబ్బంది సతమతమయ్యారు. ఇక్కడ సచివాలయాల సిబ్బందిని అందుబాటులో ఉంచితే లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇక్కడా రాజకీయమే

బుధవారం బ్యాంకులకు వచ్చి సొమ్ములు తీసుకోకుంటే వెనక్కిపోతాయని వలంటీర్లు (ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు, రాజీనామా చేసిన వారు) చెప్పడంతో లబ్ధిదారులంతా ఒకేసారి బ్యాంకులకు వచ్చినట్టు చెబుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల కారణంగానే మీకు ఈ పరిస్థితి వచ్చిందంటూ వారు లబ్ధిదారుల వద్దకు వెళ్లి చెబుతున్నట్టు ఆరోపణలున్నాయి. కొన్ని మండలాల్లో నేరుగానే ఈ విధంగా ప్రచారం సాగించినట్టు సమాచారం. లబ్ధిదారుల అగచాట్లకు ప్రభుత్వ నిర్ణయం కారణం కాగా... దానికి టీడీపీ, జనసేనలను బాధ్యులను చేయడంపై ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. ఇలా ప్రచారాలు చేసిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నెట్ సెంటర్లకు కాసుల పంట

ఆత్రేయపురం: జాతీయ బ్యాంకుల వద్ద వృద్ధులు, పింఛన్ల నగదుకు గురువారం ఉదయం పడిగాపులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులుపడ్డారు. ఆధార్ లింక్, బ్యాంకు అకౌంట్ ఉన్న వారికి ఖాతాల్లో నగదు జమైంది. కానీ కొన్ని ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ లేకపోవడంతో చార్జీల పేరిట కట్ చేసి మిగిలిన బ్యాలెన్స్ ఇచ్చారు. కొంతమంది పింఛన్‌దారులు నెట్ సెంటర్లకు వెళ్లి మినీ బ్యాంకుల్లో ఆధార్ కార్డు వేలి ముద్రతో నగదు తీసుకుంటున్నారు. ఆయా నెట్ సెంటర్లలో ఒక్కొక్క పింఛన్‌దారు నుంచి రూ.30 వసూలు చేయడంతో నెట్ సెంటర్లకు కాసుల పంట పండింది.



ఆత్రేయపురం ఐడీబీఐ బ్యాంక్ వద్ద వృద్ధుల పడిగాపులు

నగదు తీసుకునేందుకు వెళితే షాకులు



జగ్గంపేటలో సొమ్మసిల్లి పడిన వృద్ధురాలు



బ్యాంక్ వద్ద వృద్ధుల వెయిటింగ్

నగదు తీసుకునేందుకు బ్యాంకులకు వెళ్లిన వృద్ధులు, మహిళలకు షాక్‌లు మీద షాక్‌లు తగిలాయి. లబ్ధిదారులకు సంబంధించి ఆయా బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో సుమారు 50 శాతం వరకూ మనుగడలో లేనట్టు (ఇన్‌యాక్టివ్)గా బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. తిరిగి యాక్టివ్ చేయించుకునేందుకు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, పాన్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని వారు సూచిస్తున్నారు. లబ్ధిదారుల్లో 90 శాతం మందికి పాన్‌కార్డు ఉండదు. అటువంటి వారు తమకు లేదని చెప్పడంతో మిగిలిన పత్రాలు తీసుకురావాలని సూచిస్తున్నారు. మరోవైపు మే నెలకు పడిన పింఛన్ సొమ్ము రూ.3 వేలు డ్రా చేసుకునేందుకు ఫారాలు నింపి ఇచ్చిన వారికి మీ ఖాతా లో అంత నగదు లేదని, మీరు బ్యాంకు ఖాతా వాడనందున, కనీస నగదు లేకపోవడంతో చార్జీలు, రుసుములు పేరిట సొమ్ములు కట్ అయ్యాయని బ్యాంకు సిబ్బంది చెబుతుండడంతో ఆ సొమ్ముపైనే ఆధారపడిన లబ్ధిదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

గత నెల సాఫీగా.. ఈ నెల కుట్రతో..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మొన్నటి వరకు టార్గెట్ టీడీపీ.. ఇప్పుడు కూటమి.. ఇదే వైసీపీ పాలకులు అధికార దండం పట్టుకున్న నాటి నుంచీ సాగుతున్న రాజకీయ కక్ష కథా చిత్రమ్. రాజకీయ జగన్మాయా నాటకమ్. ఏదేమైనా టీడీపీపై బురదజల్లడం ఒకటే అంతిమంగా జగన్ లక్ష్యం. ఈ జాడ్యం చివరికి పింఛను తీసుకునే అవ్వాతాతల్నీ వదల్లేదు. ప్రభుత్వ పథకాల పంపిణీకి వలంటీర్లను ఎన్నికల సంఘం దూరం పెట్టిన విషయం తెలిసిందే. దీంతో మార్చి నెల పింఛన్లను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. ఇది సునాయాసంగా రెండ్రోజుల్లో పూర్తయింది. కానీ ఈ నెల పింఛను విషయంలో ప్రభుత్వం కుట్రపూరిత నిర్ణయం తీసుకుందనడంలో సందేహం లేదు. ఈ నెల సామాజిక భద్రత పింఛన్లను బ్యాంకుల ఖాతాల్లో జమచేస్తామని పాలకులు చెప్పారు. మార్చి, ఏప్రిల్ (మే 1 నుంచి పంపిణీ) నెల పింఛన్ల నడుమ నెల సమయం ఉంది. ఈలోపు పింఛను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలపై కసరత్తు జరగలేదు. ఎన్ని ఖాతాలు ఆధార్‌కి అనుసంధానమై ఉన్నాయి?, ఎన్ని ఖాతాలు మూసేశారు, ఎన్ని ఖాతాల్లో లావాదేవీలు ఆగిపోయాయి. ఎన్ని సవ్యంగా పనిచేస్తున్నాయనే అంశాలను పట్టించు కోలేదు. ఐదేళ్ల బటన్ నొక్కుడు పరిపాలన సాగించిన జగన్‌కి ఆ విషయాలన్నీ తెలుసు. కానీ ముసలి ప్రాణాలతో చెలగాటమాడి ఆ పాపాన్ని బురదగా మార్చి టీడీపీపై చల్లి ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుట్రతోనే ఉద్దేశపూర్వకంగానే పింఛను లబ్ధిదారులను ఎండలో ఉక్కిరిబిక్కిరి చేసినట్టు పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. ఈ కుట్రలో భాగంగా గత నెల కొందరు ప్రాణాలు కోల్పోయినా జగన్‌కి పట్టలేదు. ఇప్పటికే ఈ కుట్రను అర్థం చేసుకున్న లబ్ధిదారులు ఓటుతో సమాధానం చెప్పడానికి సిద్ధమవుతున్నారు.



ఇంటర్వ్యూ

ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు

- మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం
- ఉమ్మడి మేనిఫెస్టో సూపర్‌హిట్
- కాకినాడ రూరల్ అసెంబ్లీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ

ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ-జనసేన పొత్తు ఏర్పాటైందని, ప్రజలు సంక్షేమంతోపాటు అభివృద్ధి కావాలని కొత్తదనాన్ని కోరుకుంటున్నారని కాకినాడ రూరల్ అసెంబ్లీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ అంటున్నారు.. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

- వివరాలు 7లో

రేపు కాకినాడకు చంద్రబాబు రాక

- కాకినాడ రూరల్‌లో మధ్యాహ్నం రోడ్‌షో
- కాకినాడ సిటీలో సాయంత్రం బహిరంగ సభ

కాకినాడ సిటీ, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 4న కాకినాడ రానున్నారు. కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నూజివీడు జంక్షన్‌లో మీటింగ్ ముగించుకుని హెలికాప్టర్‌లో కాకినాడ చేరుకుంటారు. కొద్దిసేపు విరామం తర్వాత కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహిస్తారు. సాయంత్రం 5గంటల సమయంలో కాకినాడ సిటీ నియోజకవర్గం భానుగుడి జంక్షన్ వద్ద బహిరంగ సభలో మాట్లాడతారు. చంద్రబాబు రోడ్‌షో విజయవంతానికి టీడీపీ నేతలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వేట్లపాలెంలో కూటమి అభ్యర్థుల భారీ ర్యాలీ



వాహనంపై ర్యాలీలో పాల్గొన్న చినరాజప్ప, తంగెళ్ల ఉదయ్, గుణ్ణం చంద్రమౌళి

- హాజరైన పెద్దాపురం టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చినరాజప్ప, కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళి

సామర్లకోట, మే 2: సామర్లకోట మండలం వేట్లపాలెంలో కూటమి అభ్యర్థుల గెలుపు కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ గ్రామమంతా చుట్టుముట్టి హోరెత్తించింది. ప్రచార అగ్రభాగాన పెద్దాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ప్రజలకు అభివాదం తెలుపుతూ బైక్‌ర్యాలీగా వెళ్లారు. మూడు పార్టీలకు సంబంధించి వెయ్యి మోటార్‌సైకిళ్లు, 20కార్లలో ఈ ర్యాలీ కొనసాగింది. ముందుగా వేట్లపాలెం వెంకన్న ఆలయంలో పూజలుచేశారు. భారీ బాణసంచా కాల్పులతో, పూలవర్షాలతో ప్రచారం విశేషంగా ఆకట్టుకుంది. నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 100 కుటుంబాలు

పెద్దాపురం, మే 2: వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయని, త్వరలో జరిగే ఎన్నికల్లో విజయం సాధించేది కూటమే అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం సుధా కాలనీలోని క్యాంపు కార్యాలయంవద్ద నిర్వహించిన చేరికలు కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. సామర్లకోట 26వ వార్డుకు చెందిన 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి చినరాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలోకి చేరేవారికి ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమికి అండగా నిలవాలన్నారు. అడబాల కుమాస్వామి, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.



భాస్కరరామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చినరాజప్ప

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

సామర్లకోట, మే 2: మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావు వర్ధంతిని పురస్కరించుకుని సామర్లకోట మఠంసెంటర్‌లో బీబీఆర్ అభిమానులు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డువెంకటరమణచౌదరి ప్రారంభించి పలువురికి మజ్జిగ అందజేశారు. అంతకుముందు భాస్కరరామారావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, బీబీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న చినరాజప్ప

కాకినాడలో 5న హోమ్ ఓటింగ్: ఆర్వో

కార్పొరేషన్(కాకినాడ), మే 2: దివ్యాంగులు, 86ఏళ్ల వృద్ధుల కోసం ఈనెల 5న హోమ్ ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లతో గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ కోసం 43మందిని గుర్తించామన్నారు. వీరి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించేందుకు ఐదు రూట్‌లుగా విభజించామన్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైన సూచనలు ఇచ్చారు. 5న ఒక్కరోజు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉన్న వారి కోసం ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందోని స్పష్టం చేశారు.



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

కలెక్టరేట్(కాకినాడ), మే 2: జిల్లాలో ఎన్నికల విధుల్లోఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ సిబ్బంది పీవో, ఏపీవో, ఓపీవో, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్లు దీన్ని వియోగించుకోవాలన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఈనెల 4,5,6 తేదీల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు వేయాలన్నారు. జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాలో ఓటుహక్కు కలిగినవారు ఈనెల 7, 8 తేదీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 2: కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఏపీఎస్పీ జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న పీవో, ఏపీవో పోలింగ్ సిబ్బంది రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ నివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్స్ పనితీరు పోలింగ్ ప్రక్రియ నిర్వహణ అంశాలను పోలింగ్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు ఈవీఎంల వినియోగానికి సంబంధించి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు లావాదేవీలు పైపైకి..

జగ్గంపేట, మే 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ రూ.50వేలు మించి నగదుతో ప్రయాణించకూడదనే నిబంధనతో ప్రజలకు చిక్కులు ఎదురవుతున్నాయి. ఏదొక సందర్భంలో ఎక్కువ డబ్బు పట్టుకెళ్లాల్సిన పరిస్థితిలో బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ బ్యాంక్ అకౌంట్‌లో వేసుకుని తమకు అవసరమైనప్పుడు మరలా బ్యాంకు ఖాతాల్లోని నగదు విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఉదయం బ్యాంకుల్లో డబ్బులు వేయడం సాయంత్రానికి తమ గమ్యస్థానాలకు చేరుకున్నాక డబ్బులు విత్‌డ్రా చేయడం చేస్తున్నారు. కొంతమందికి బ్యాంకింగ్‌పై అంత అవగాహన లేకపోవడంతో డబ్బుతో ప్రయాణించడానికి నిబంధనలు అడ్డురావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు డబ్బులు వేయడం తీయడంతో బ్యాంకింగ్ సర్వర్లపై అధిక భారం పడడంతో అవి నిలిచిపోతున్నాయి.



ప్రచారం హోరెత్తుతోంది..

మైకుల్లోను, సోషల్ మీడియాలోనూ దూకుడు

సెల్‌ఫోన్లకు వాయిస్ కాల్స్, సంక్షిప్త సందేశాలు

సామర్లకోట,మే 2: ఈ ఎన్నికల్లో నాయకులు గతానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైకులతో హోరెత్తిస్తుండగా, ఇళ్లల్లో సెల్‌ఫోన్‌లకు అభ్యర్థుల వాయిస్‌తో ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, స్మార్ట్ ఫోన్లు ప్రతీ ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సాప్ ద్వారా ప్రతీ అంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా చెప్తున్నారు. వారం రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరపున ఆయా పార్టీల మద్దతుదారులు పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్ చేసి వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీని వలన ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో ఫోన్ లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడం లేదు. బంధువులు, హితులు పనులపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమకపడుతున్నారు. ప్రశాంతత కోరుకునే గ్రామీణులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా అనేక సార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగుచెందుతున్నారు.





‘లెక్క’ తేలుస్తారు

- నామినేషన్ల దగ్గర నుంచి ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందే
- ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇబ్బందే

అంబాజీపేట, మే 2: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు ఖర్చులు చూపించాల్సిందే. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థి రూ. 95 లక్షల వరకూ ఖర్చు చేసుకోవాల్సి ఉంది. నామినేషన్ నాటి నుంచి ఈ ఖర్చులు అమలులోకి వస్తాయి. అభ్యర్థి జాతీయ బ్యాంకుల్లో ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు ఖర్చులను నమోదు చేస్తారు. అభ్యర్థులు ఖర్చుపెట్టిన లెక్కలను ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులు అప్పగించాలి. లెక్కలను సరైన సమయంలో చూపకున్నా వారిపై వేటు పడటంతో పాటు తర్వాత ఎన్నికలలో పోటీ చేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఖర్చు చేయకూడదు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, సామగ్రి అభ్యర్థిది అని తెలితే అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజువారీగా అభ్యర్థులు ఖర్చుతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధనం, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్‌మీడియా ప్రకటనలకు చేసే ఖర్చును అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికి బిల్లు సమర్పించాలి.

పెరుగుతున్న వ్యయ పరిమితి

ఐదేళ్లకు ఒక్కసారి జరిగే ఎన్నికల వ్యయ పరిమితి క్రమేపీ పెరుగుతోంది. 1952లలో సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష ఉండేది. 1957లో రూ.2 లక్షలు, 1962లో రూ.3 లక్షలు, 1971లో రూ.4 లక్షలు, 1975లో రూ.5 లక్షలు, 1984 రూ.10 లక్షలు, 1991లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009లో రూ26 లక్షలు, 2014లో రూ.28 లక్షలు, 2019లో రూ.30 లక్షలు పరిమితిని నిర్ణయించారు. ప్రస్తుతం రూ.40 లక్షలు నిర్ణయించారు.

గీత దాటితే శిక్షార్హులే..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నికల నిబంధనలు ఉల్లఘించడం నేరం.. ఈ నేరాలకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. ప్రజా ప్రాతినిథ్యం చట్టం 1951 సెక్షన్ 123(1) ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం భయందోళనలకు గురి చేయడం, కులమత విద్వేషాలను పెంచటం, వ్యక్తిగత విషయాలను విమర్శించటం నేరం. సెక్షన్ 125 ప్రకారం శతృత్వం కలిగించటం నేరం.. సెక్షన్ 126 ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో ప్రచారం చేయటం కూడా నేరం. సెక్షన్ 127 ప్రకారం ఇతరుల సమావేశాలకు భంగం కలిగించటం 127 (ఎ) ప్రకారం పోస్టర్లు, కరపత్రాలపై నియంత్రణ లేకపోవటం కూడా నేరం.. సెక్షన్ 128 ప్రకారం రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించటం నేరం. సెక్షన్ 130,131,132, ప్రకారం పోలింగ్ కేంద్రాలు వద్ద ప్రచారం చేయటం క్రమశిక్షణ లేకుండా బూత్‌ల వద్ద ప్రవర్తించటం నేరం. సెక్షన్ 133 ప్రకారం పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటర్లను వాహనాల ద్వారా తరలించటం నేరం. సెక్షన్ 134 ప్రకారం ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ తాయిలాలు అందించటం నేరం, సెక్షన్ 135,135ఎ, 136 ప్రకారం పోలింగ్ కేంద్రాలలోకి చొరబడటం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను, రికార్డులను తొలగించటం నేరం, సెక్షన్ 171జీ ప్రకారం ఎన్నికలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేయటం నేరం. సెక్షన్ 172హెచ్, 172ఐ ప్రకారం ఖర్చులు జమా లెక్కలు చెప్పకపోవటం వంటి తదితర నేరాలన్ని ఎన్నికలు ప్రవర్తనా నియమవళి కిందకే వస్తాయి.



ఎవరేం చేస్తారు..?

- ఎన్నికల విధుల్లో అధికారుల బాధ్యతలు కీలకం
- ఒక్కో అధికారిది ఒక్కో విధి..

మండపేట, మే 2: త్వరలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో బిజీ అయిపోయారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధికారి మొదలుకుని పోలింగ్ స్థాయి అధికారి వరకు అందరూ కీలకమే.. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల వెల్లడి వరకు అధికారుల పాత్ర చాలా కీలకం. ఇక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసే బాధ్యత కూడా వారిదే.. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు వివిధ పోలింగ్ ఆఫీసర్లు నిరంతరం ఎన్నికల విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణ నియంత్రణకు లోబడి ప్రతి జిల్లాకు ఒక అధికారి ఉంటారు. సంబంధిత కలెక్టర్ ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తారు.

ఆర్వో

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహణ నేపథ్యంలో ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉంటారు. ఆయా నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా జేసీ స్థాయి అధికారి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అభ్యర్థుల గుర్తుల కేటాయింపులు తదితర వాటిని వీరే చూస్తారు. అభ్యర్థుల తుది జాబితా వారే తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి తదితర పనులు ఆర్వో పర్యవేక్షణలో జరుగుతాయి. ఆర్వో అన్ని విధాలుగా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడతారు.

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలకు ఓ సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట్ల 144 సెక్షన్ విధించే అవకాశం సెక్టోరల్ అధికారికే ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్‌బూత్‌లు గుర్తించి అక్కడ బందోబస్తుకు సిఫార్సు చేస్తారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గ స్థాయిలో ఉండే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎక్కడా మద్యం, నగదు పంపిణీలు జరగకుండా ఓటర్లను రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురిచేయకుండా చూస్తారు. బహుమతుల తరలింపునకు అడ్డుకట్ట వేస్తారు.


మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరుపై నివేదికను రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపటంలో వీరి పాత్ర కీలకం. ఇక కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులు అందజేయటం, ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడటం బీఎల్వోల బాధ్యత.. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, ఓటరు జాబితాల ప్రదర్శన, పోలింగ్ కేంద్రాలు మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటర్ల జాబితా అధికారులు

ఓటర్ల జాబితాను తయారు చేయటం ఈయన బాధ్యత. ఓటు నమోదు చేసుకునేవారు జాబితాలో పేర్లు తప్పుగా ఉంటే వారు ఈయనను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు.ఈయన పర్యవేక్షణలో కొంతమంది సిబ్బంది పనిచేస్తుంటారు.

రాష్ట్ర రాజకీయాలలో అనపర్తి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి ఓటర్ల తీర్పును బట్టే రాష్ట్ర పరిస్థితులు ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ ఓటర్లు సామాన్యులను సైతం అందలమెక్కిస్తారు. రామవరం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న నల్లమిల్లి మూలారెడ్డిని నియోజకవర్గ ప్రజలు నాలుగు సార్లు అసెంబ్లీకి పంపగా, అనపర్తి సర్పంచ్‌గా ఉన్న తేతలి రామారెడ్డిని ఇక్కడి ప్రజలు రెండు సార్లు అసెంబ్లీకి పంపారు. సామాజిక వర్గాల ప్రాతిపదికన రెడ్డి ఓటర్లు అధికంగా ఉన్న అనపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి 2019వరకు జరిగిన తొమ్మిది ఎన్నికల్లో ఐదుసార్లు పట్టం కట్టారు. 2014 ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి తీరుతుందని విశ్లేషకుల అంచనాలను వమ్ము చేస్తూ ఇక్కడి ఓటర్లు తెలుగు దేశం పార్టీకి పట్టంగట్టారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా అనపర్తిలో బీజేపీ తెరపైకి వచ్చింది. గత ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్డీయే అభ్యర్థిగా బీజేపీ తరపున రంగంలోకి దిగగా వైసీపీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తిరిగి వైసీపీ తరపున బరిలో నిలిచారు.



పడాల సత్యనారాయణరెడ్డి | తేతలి లక్ష్మీనారాయణరెడ్డి | పాలచర్ల పనసరామన్న | వల్లూరి రామకృష్ణ చౌదరి | పడాల అమ్మిరెడ్డి | నల్లమిల్లి మూలారెడ్డి | తేతలి రామారెడ్డి | నల్లమిల్లి శేషారెడ్డి | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి | సత్తి సూర్యనారాయణరెడ్డి

- అనపర్తి ఓటర్ల తీర్పు విలక్షణం
- సామాన్యులను సైతం అందలమెక్కించిన ఓటర్లు
- ఇక్కడ గెలిచే పార్టీకే రాష్ట్రంలో అధికారం వచ్చే సంప్రదాయం
- సర్పంచ్‌లు సైతం ఎమ్మెల్యేలైన వైనం

● (అనపర్తి)


సామాన్యులకు అందలం

అనపర్తి నియోజకవర్గంలో విలక్షణ ఓటరు



నియోజకవర్గ ఆవిర్భావం

1952లో నియోజకవర్గం ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. 2009 ఎన్నికలలో నల్లమిల్లి శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి తనయుడు రామకృష్ణారెడ్డి మూలారెడ్డి వారసుడిగా బరిలో దిగారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి మేనల్లుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పోటీ చేశారు. అయితే ఇక్కడ స్వల్ప మెజారిటీతో రామకృష్ణారెడ్డి (తెలుగుదేశం) ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో తిరిగి వీరిద్దరే ప్రధాన పోటీలో నిలవగా వైసీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై 55 వేల భారీ మెజారిటీతో విజయం సాధించారు.



జి.మామిడాడలో కోదండ రామాలయం

గుర్తింపు పొందిన నేతలు

1971లో నల్లమిల్లి మూలారెడ్డి అనపర్తి మండల రామవరం సర్పంచ్‌గా గెలుపొంది 1983లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా సేవలందించారు. అప్పట్లో సమితి ఎన్నికలలో ఉండవిల్లి సత్యనారాయణమూర్తిపై పోటీ చేసి రాష్ట్ర ప్రముఖుల వద్ద గుర్తింపు పొందారు. నమ్ముకున్న వారి కష్టాలను తీర్చే నాయకుడిగా పేరు పొందారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. తేతలి రామారెడ్డి అనపర్తి గ్రామ సర్పంచ్‌గా రాజకీయాల్లో ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1989, 2004లో రెండు పర్యాయాలు శాసనసభ్యునిగా పనిచేశారు. సౌమ్యుడిగా పేరుగాంచిన తేతలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తొలుత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తదుపరి 2009 ఎన్నికలలో అనపర్తి అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



అనపర్తిలో ఐటీసీ లిమిటెడ్, ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీ ఉన్నాయి. బిక్కవోలులో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఉంది. అలాగే అనపర్తి నియోజకవర్గం వ్యాప్తంగా చాలా కోళ్ల ఫారాలు ఉన్నాయి. రైస్‌మిల్లులకు కూడా ఈ ప్రాంతం ప్రసిద్ధి



అనపర్తి దేవీచౌక్

వేధిస్తున్న సమస్యలు

ఎప్పటికి పరిష్కారమయ్యేనో..

అనపర్తి నియోజకవర్గంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకం మరమ్మత్తులు చేపట్టి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన పదవీకాలంలో వేలాది ఎకరాలకు నీరందించారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో తిరిగి మరమ్మత్తులకు గురైనా పూర్తి స్థాయిలో మరమ్మత్తులు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. . వేమగిరి నుంచి సామర్లకోట వరకు ఎర్రకాలువలో అనేక వ్యర్థాలు కలిసి నీరు కలుషితమవుతోంది. మురుగు నీరు పోయేందుకు ఈ కెనాల్‌కు అనుసంధానంగా డెడికేటెడ్ చానల్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని నిర్మాణం కోసం మాజీ శాసన సభ్యుడు తేతలి రామారెడ్డి ప్రయత్నాలు చేసినప్పటికి ఫలితం లేకపోయింది. ఈ సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాల్సి ఉంది. అదే విధంగా వేమగిరి సామర్ల కోట కెనాల్ రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది.

రాజకీయ చరితం

భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ద్విసభ నియోజకవర్గంగా అనపర్తి నియోజకర్గం ఏర్పడింది. అప్పటికి కొనసాగుతున్న పిర్కాల వ్యవస్థలో అనపర్తి, సోమేశ్వరం పిర్కాలను అనపర్తి నియోజకవర్గంగా రూపొందించారు. ఈ ద్విసభ నియోజకవర్గానికి తొలిసారిగా కొంకుదురు గ్రామానికి చెందిన పడాల సత్యనారాయణరెడ్డి(కాంగ్రెస్) ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955లో జరిగిన ఎన్నికలలో తేతలి లక్ష్మీనారాయణరెడ్డి(ప్రజాపార్టీ) ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన పునర్విభజనలో అనపర్తి నియోజకవర్గం నుంచి సోమేశ్వరం పిర్కాను తొలగించి తాపేశ్వరం పిర్కాను జత చేశారు. ఈ పునర్విభజనతో అప్పటి వరకు రెడ్డి సామాజిక నియోజకవర్గంగా కొనసాగిన అనపర్తి కమ్మ సామాజిక వర్గం చేతుల్లోకి వెళ్లింది. 1962 నుంచి 1967 వరకు మండపేటకు చెందిన పాలచర్ల పనసరామన్న (కమ్యూనిస్టు పార్టీ), 1967 నుంచి 1978 వరకు వల్లూరి రామకృష్ణ చౌదరి(కాంగ్రెస్) ఎమ్మెల్యేలుగా పనిచేశారు. తిరిగి 1978లో జరిగిన పునర్విభజనలో అనపర్తి, సోమేశ్వరం పిర్కాలు జతకలిశాయి. దీంతో రెడ్డి సామాజిక వర్గానికి రాజకీయ నాయకత్వం లభించింది. 1978లో కొమరిపాలెంకు చెందిన పడాల అమ్మిరెడ్డి(జనతాపార్టీ) తరపున ఎన్నికయ్యారు. 1983,85,94,99 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున నల్లమిల్లి మూలారెడ్డి ఎన్నికయ్యారు. 1989,2004లో తేతలి రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో జరిగిన పునర్విభజనలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు కలిసి నియోజకవర్గంగా ఏర్పడ్డాయి. పునర్విభజన తర్వాత 2009 ఎన్నికలలో నల్లమిల్లి శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన ఎన్నికలలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ తరపున పోటీ చేసిన డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం





నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మొత్తం గ్రామాలు 58

మొత్తం ఓటర్లు : 2,23,253

మహిళలు : 1,13,930

పురుషులు : 1,09,323

పోలింగ్ కేంద్రాలు 228

సంవత్సరం	విజేత	పార్టీ
1952	పడాల సత్యనారాయణరెడ్డి	కాంగ్రెస్
1955	తేతలి లక్ష్మీనారాయణరెడ్డి	ప్రజాపార్టీ
1962	పాలచర్ల పనసరామన్నచౌదరి	కమ్యూనిస్టు పార్టీ
1967	వల్లూరి రామకృష్ణ చౌదరి	కాంగ్రెస్
1972	వల్లూరి రామకృష్ణ చౌదరి	కాంగ్రెస్
1978	పడాల అమ్మిరెడ్డి	జనతాపార్టీ
1983	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1985	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1989	తేతలి రామారెడ్డి	కాంగ్రెస్
1994	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1999	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
2004	తేతలి రామారెడ్డి	కాంగ్రెస్
2009	నల్లమిల్లి శేషారెడ్డి	కాంగ్రెస్
2014	నల్లమిల్లి రామకృష్ణారెడ్డి	తెలుగుదేశం
2019	డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి	వైసీపీ

ఇంటర్వ్యూ

ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు



- మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం
- ఉమ్మడి మేనిఫెస్టో సూపర్‌హిట్
- కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ

ప్రశ్న: ప్రస్తుతం ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జ: ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ-జనసేన పొత్తు ఏర్పాటు కావడంతో ఎన్నికల ప్రచారంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాల్గొంటున్నారు. ఏ ఇంటికెళ్లినా మా ఓట్లు కూటమికే వేస్తామంటూ మార్పును కోరుకుంటున్నారు.

ప్ర. ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు ?

జ. మహిళలనుంచి స్పందన చాలా బాగుంది. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో కబ్జాలు, దోపిడీలు, అవినీతి, సెటిల్‌మెంట్ల దందాలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలపై ప్రజలంతా తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.

ప్ర. మీకున్న గెలుపు అవకాశాలేంటి ? ఎందుకంత ధీమా?

జ. 2019 ఎన్నికల్లో ఓడిపోయినా జనసేనాధిపతి పవన్ స్ఫూర్తితో నిత్యం ప్రజాసమస్యలపైనా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం కొనసాగించాను. పవన్, చంద్రబాబుపై ప్రజలకు ఉన్న నమ్మకం, ఉమ్మడి మేనిఫెస్టో సూపర్‌హిట్ కావడంతో కూటమి తరఫున ఎమ్మెల్యేగా నా విజయం నల్లేరుపై నడకే. 30వేలపై చిలుకు మెజారిటీతో విజయం సాధిస్తా.

ప్ర. ఇక్కడ మెజారిటీ వర్గాల కోసం మీరేమీ చేయబోతున్నారు?

జ. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలకు సక్రమంగా తాగునీరందని పరిస్థితులున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మెజారిటీ గ్రామాల్లో డ్రైనేజీ సౌకర్యం లేక ఇంట్లో వాడకం, మురుగునీరు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యేగా నెగ్గిన వెంటనే మౌళిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తా.

ప్ర. గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయం ఏంటి?

జ. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారు. వ్యవసాయ మంత్రిగా కన్నబాబు ఉన్న సమయంలో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకోలేదు. రైతులను మోసం చేశారు. వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశారు.

ప్ర. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు?

జ. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ప్రజలకు నేరుగా నన్ను కలుసుకునే స్వేచ్ఛ కల్పిస్తా.

ప్ర. గెలిచాక ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?

జ. వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేస్తా. పారిశ్రామిక పరిశ్రమల నుంచి పొల్యూషన్ నివారణకు కృషి చేస్తా. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు చర్యలు తీసుకుంటా. ఉపాధి హామీ పథకాన్ని పంట కాలువల ఆధునికీకరణను అనుసంధానంచేస్తాం. టీడీపీ హయాంలో నిర్మించిన మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను రైతులకు వినియోగంలోకి వచ్చేలా కృషి చేస్తా. కరపలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తా. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా. కాకినాడ బీచ్ అభివృద్ధికి కృషి చేస్తా.

ప్ర. కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

జ. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజాశ్రేయస్సు కోసం చంద్రబాబు, పవన్ పొత్తు పెట్టుకున్నారు. అధినాయకుల ఆకాంక్షలకు అనుగుణంగా టీడీపీ నేతలు, పార్టీ కేడర్ సమన్వయంతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

ప్ర. ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది?

జ. నా కుమారుడు సందీప్, భార్య, సోదరి కుటుంబీకులు ప్రచారం చేస్తున్నారు. వారి సహకారం నాకు ఎప్పుడూ ఉంటుంది.

ప్ర. మీ పార్టీ ఎన్నికల హామీలపై జన స్పందన ఏంటి?

జ. ఉమ్మడి మేనిఫెస్టోతో ప్రజలంతా కూటమి వైపు మొగ్గుచూపుతున్నారు.

దుర్గాడలో నాగబాబు, హైపర్ ఆది రోడ్‌షో

గొల్లప్రోలు రూరల్, మే 2: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు బుధవారం రోడ్ షో నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణంరాజు, స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆదిలతో కలిసి నిర్వహించిన ఈ రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. గ్రామంలోని గొల్లపేట, ఆటోస్టాండు, బాబు హౌస్, వీవర్స్ కాలనీ, రైల్వేస్టేషన్, పల్లపువీధి, రామాలయం సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా సాగిన ఈ రోడ్‌షోకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. ప్రజలు భారీగా రోడ్లపైకి రావడంతో నాగబాబు, వర్మ ఓపెన్‌టాపు జీపు దిగి వారితో కొంతదూరం పాదయాత్ర చేశారు. రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి నాగబాబు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దాలని పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. అధికారంలో లేకపోయినా సినిమాల్లో సంపాదించిన సొమ్మును ఖర్చుపెట్టి ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు కుటుంబాలను ఆదుకోవడంతో పాటు కష్టసమయాల్లో ప్రజలకు అండగా ఉన్నారని చెప్పారు. కాకినాడ సెజ్ ప్రాంతంలో వస్తున్న అరబిందో ఫార్మా సహా ఇతర పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు కల్పిస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాలు నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకువచ్చి ఇక్కడ పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహిస్తామన్నారు. యువతకు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడుతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగబాబు

హైపర్ ఆది పంచులే..పంచులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 2: 'మీ ఇంటిలో మంచి జరిగితేనే ఓటు వేయమని జగన్ అంటున్నారు, వారింటిలోనే మాకు మంచి జరగలేదని, ఇద్దరు చెల్లెళ్లు రోడ్డు మీద తిరుగుతున్నారు. వాళ్లింటిలోనే మంచి జరగనప్పుడు మీ ఇంటిలో మంచి జరిగిందంటే నమ్ముతారా' అని జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బుధవారం జనసేన నేత నాగబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మలు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న హైపర్ ఆది జగన్‌పై, వైసీపీ నేతలపై పంచుల మీద పంచులు వేశారు. కల్తీ మద్యం, కల్తీ ప్రభుత్వం పోవాలంటూ కూటమి అభ్యర్థులకు, పిఠాపురం అసెంబ్లీ, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు. ప్రస్తుతం పిఠాపురంలో ఎందుకు పుట్టలేదనే బాధ ఉందని, పుట్టి ఉంటే పవన్‌కు ఓటు వేసే అవకాశం లభించేది అని తెలిపారు. బటన్ నొక్కితే రూ. 10వేలు ఆడవాళ్ల ఖాతాల్లో పడుతున్నాయని జగన్ అంటున్నారని, అదే రోజు సాయంత్రం మగవాళ్లు మూత విప్పితే రూ.30 వేలు పోతున్నాయని చెప్పారు. పొద్దున బటన్ నొక్కుతున్నారు, సాయంత్రం పీక నొక్కుతున్నారని సెటైర్లు వేశారు. పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు ప్రచారంలో వడదెబ్బ తగిలింది అంటున్నారు. అయిదేళ్లల్లో మనకు ఇంతకంటే పెద్ద దెబ్బలు తగిలాయి, రాబోయే రోజుల్లో 151 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులకు వడదెబ్బలు తగులుతాయి, ఇటువంటి డ్రామాలు నమ్మకండి అని సూచించారు. ఆది పంచులకు ప్రజలు నుంచి మంచి స్పందన లభించింది.

ఆటోలో రూ.2.10 లక్షలు సీజ్

అప్పు తెచ్చుకున్న సొమ్ము అంటూ బాధితులు లబోదిబో

గొల్లప్రోలు రూరల్, మే 2: బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకువెళుతున్న నగదును పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు సీజ్ చేయడం వివాదాస్పదంగా మారింది. అన్ని ఆధారాలు చూపించినా నగదును స్వాధీనం చేసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేబ్రోలు గ్రామానికి చెందిన పి.గంగమణి దుర్గ తన కుటుంబ అవసరాలు నిమిత్తం గొల్లప్రోలు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో బంగారు వస్తువులు తనఖా పెట్టి రూ.2.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ మొత్తాన్ని తీసుకుని ఆటోలో ఇంటికి వెళుతుండగా గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తాటిపర్తి జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును గొల్లప్రోలు టోల్‌గేట్ ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించారు. దీనిపై బాధితురాలు తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. బంగారు వస్తువులను బ్యాంకులో తాకట్టు పెట్టి అప్పు తీసుకుని నగదు పట్టుకెళుతుండగా పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారని, అన్ని ఆధారాలు చూపినా వదిలిపెట్టలేదని తెలిపారు. తన కుమార్తె గర్భిణి అని, నిబంధనలకు విరుద్ధంగా నగదు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎన్నికలు అంటూ సామాన్యులను ఇబ్బందులు పెడతారా అని ప్రశ్నించారు. కాగా అధికార వైసీపీ నేతలు బహిరంగంగా నగదు పంపిణీ చేస్తున్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు సామాన్యులపై మాత్రం తమ ప్రతాపం చూపిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

మోదీ సభకు చురుగ్గా ఏర్పాట్లు



ఏర్పాట్లపై చర్చిస్తున్న పోలీసు అధికారులు

కడియం, మే 2: ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన వేమగిరి జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సభలో ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రానున్నట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీ రాజు తెలిపారు. ఈ సభకు సంబంధించి అధికారులతో చర్చించారు. ఎంతమంది వస్తారు ? ఎన్ని కార్లు ? బస్సులు అనే విషయాలను తెలియజేశారు. ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పక్కాగా చేస్తామని ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ముగ్గురు నేతలు వచ్చేందుకు అనువైన హెలిప్యాడ్ ప్రదేశాలను గురువారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జేసీ తేజ్‌భరత్ పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహారావు, డీపీవో రాంబాబు, డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, ఎంపీడీవోలు రాజ్‌మనోజ్; డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రూరల్ బీజేపీ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

విహారంలో విషాదం

సీతపల్లి వద్ద వాగులోకి దిగి ఇద్దరు యువకుల మృతి









రంపచోడవరం/సామర్లకోట, మే 2: అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి సమీపాన ఉన్న విహార ప్రాంతంలోని వాగులోకి దిగి కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఇద్దరు యువకులు గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. సామర్లకోట పట్టణం బ్రౌన్‌పేట, గణేష్ కాలనీలకు చెందిన మొత్తం 13 మంది విహార యాత్రకు వచ్చారు. వారంతా సీతపల్లి సమీపాన వాగులోకి దిగగా వర్దనపు రాజ్‌కుమార్(28), మాసా అభిలాష్(29) మునిగిపోయారు. కొద్దిసేపటికి మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు వివరించారు. పెయింటింగ్ పనిచేసుకుని కుటుంబాలను పోషించుకునే ఇద్దరూ మృతిచెందడంతో సామర్లకోటలోని బలుసులపేట, గణేష్ కాలనీలు విషాదఛాయలు అలుముకున్నాయి.

15 బైక్‌లు స్వాధీనం

సామర్లకోట, మే 2: సామర్లకోట, కిర్లంపూడి, గండేపల్లి, రాజానగరం తదితర ప్రాంతాలలో ఇటీవల కాలంలో తాళాలు వేసి ఉన్న మోటార్ సైకిళ్లను దొంగలిస్తున్న మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన బండారు మధుబాబును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి వెల్లడించారు. గురువారం సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు డీఎస్పీ వివరాలు అందించారు. కిర్లంపూడిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మధుబాబును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో మోటార్ సైకిళ్ల చోరీలు గురించి బయటపడిందన్నారు. బైక్‌ల విలువ సుమారు రూ.5.63 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు క్రైం సీఐ అంకబాబు, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ ఎస్‌కే జబీర్‌లను డీఎస్పీ అభినందించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సామర్లకోట, మే 2: జిల్లా ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, ఐపీఎస్ అధికారి డాక్టర్ సంజీవ్ ఎం.పాటిల్ గురువారం పట్టణం, హుస్సేన్‌పురంలో పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అక్కడి ప్రజలతో ప్రత్యేక పరిశీలకులు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం నిర్వహణపై సదుపాయాలపై ప్రశ్నించారు. సామర్లకోట ఎస్‌హెచ్‌వో సురేష్, ఎస్ఐ మౌనిక తదితర పోలీసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

పెద్దాపురం, మే 2: కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు కాకినాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని వాలుతిమ్మాపురం గ్రామంలో ఉన్న పట్టాబి ఆగ్రోఫుడ్స్, లలితా ఇండస్ట్రీస్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులతో ఆయన పెద్దాపురం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి గురువారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రూపొందించిన మేనిఫెస్టోలో ఎన్నో పథకాలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. అలాగే కాకినాడ పోర్టును అభివృద్ధి చేయడంతోపాటు, ఎస్ఈజెడ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. ఏడీబీ రహదారిని మెరుగుపరుస్తామన్నారు. నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని వర్గాల కార్మికులను ఆదుకుని వారి అభివృద్ధికి తమవంతు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబు రాజు, పట్టాబి ఆగ్రోఫుడ్స్ అధినేత శ్రీనివాస్, లలితా ఇండస్ట్రీస్ ఎండీలు మట్టే సత్యప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం పట్టాభి ఆగ్రోఫుడ్స్ పరిశ్రమలో మాట్లాడుతున్న ఉదయ్‌శ్రీనివాస్



కాకినాడలో ఉదయ్ శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న జనసేన ప్రచార కమిటీ సభ్యుడు రామారావు

'ఉదయ్‌ను గెలిపించుకుందాం'

కాకినాడ సిటీ, మే 2: జిల్లా భావితరాల బంగారు భవిష్యత్తు కోసం కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను గెలిపించుకుందామని జనసేన పార్లమెంట్ ప్రచార కమిటీ సభ్యుడు టీవీ రామారావు గాజుగ్లాసు గుర్తు ప్ల కార్డులతో ప్రచారం సాగించారు. గురువారం జనసేన కార్యకర్తలతో కలిసి కాకినాడ రూరల్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఉదయ్ శ్రీనివాస్ గెలుపు కోసం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చేపల మార్కెట్‌లో వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. పేదలను ఆదుకునే ప్రభుత్వం రాబోతోందని, గాజుగ్లాసు గుర్తుపై ఓట్లువేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

'ఉదయ్ గెలుపు ఖాయం'

తుని రూరల్, మే 2: అధికార పార్టీ నాయకులు, మంత్రి అనుచరులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా తమ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అఖండ మెజార్టీతో ఖాయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవ్ మధు వీరేష్ స్పష్టం చేశారు. తునిలో మీడియాలో సమావేశంలో మాట్లాడుతూ తాము గ్రామంలో డోర్ టు డోర్ ప్రచార ంలో భాగంగా గుడ్‌మార్నింగ్ జనసేన కార్యక్రమంలో జనంతో మమేకమవుతున్నామని, జనాలు కూటమి ప్రభుత్వాన్ని గెలపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ మూలకు వెళ్లినా తునిలో అవినీతి అక్రమాలు, అరాచకాలు తమ దృష్టికి తీసుకువస్తున్నారని.. తునిలో ప్రశాంతమైన వాతావరణం ఉండాలంటే కూట మి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 5నతునిలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, సభ విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గానికి సంబంధించిన వీర మహిళ కృష్ణవేణి, బోనం చినబాబు, అల్లు నాగేశ్వరరావు,లోవరాజు ఉన్నారు.



తునిలో విలేకర్ల సమావేశంలో జనసేన శ్రేణులు

'ఎన్నికల్లో కూటమిదే గెలుపు'

గండేపల్లి, మే 2: ఎన్నికల్లో కూటమిదే గెలుపు అని, అత్యంత మెజార్టీతో కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ గెలవడంతో పాటు చంద్రబాబు సీఎం అవుతారని టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అన్నారు. మల్లేపల్లి శుభప్రద కల్యాణమండపంలో కూటమి నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ మేనిఫెస్టోలో ప్రత్యేకత లేదన్నారు. టీడీపీ మేనిఫెస్టో సామాన్యుడి దగ్గర నుంచి నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబీకులకు ఉపయోగపడేలా ఉందన్నారు. కూటమి గెలిపిచేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, దిడ్డి చినశ్రీను, రామకుర్తి నరసింహం, బత్తుల రమణ, కొల్లి త్రిమూర్తులు, తెలగరెడ్డి ప్రకాశ్, వీరభద్రరావు పాల్గొన్నారు.



టీడీపీలోకి నక్కా కుటుంబ సభ్యులను ఆహ్వానిస్తున్న రాజప్ప

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

సామర్లకోట, మే 2: సామర్లకోటకి చెందిన వైసీపీ కౌన్సిలర్ నక్కా లలిత భర్త నక్కా శ్రీనివాస్, మరిది నక్కా జానకిరామయ్య, వీరి తండ్రి నక్కా బాబూరావు తదితర 60 కుటుంబాలు వైసీపీని వీడి గురువారం టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ తదితర పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నక్కా కుటుంబీకుల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరయ్యి నూతనంగా పార్టీలోకి చేరిన నక్కా కుటుంబీకులకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. అరాచక వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాయాలపై పోరాటాలు చేస్తున్న తెలుగుదేశం పార్టీతో కలిసి పోరాడేందుకు ముందుకొచ్చేవారికి తెలుగుదేశం ద్వారాలు తెరిచే ఉంటాయని ఎమ్మెల్యే చినరాజప్ప చెప్పారు. పలువురు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామర్లకోట పట్టణంలో బలుసులపేటకు చెందిన వైసీపీ నాయకులు పెయ్యల చక్రవర్తి తదితర 20 మంది అనుచరులతో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, 13వ వార్డు టీడీపీ నాయకులు కాళ్ళ రవీంద్ర తదితర పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చినరాజప్ప పార్టీలోకి చేరినవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు.

మద్యం అమ్మకాలపై పటిష్ట నిఘా

కాకినాడ క్రైం, మే 2: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏరులై పారే మద్యానికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ పటిష్ట నిఘాను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో విక్రయాలు సాగినా డిజిటల్ పేమెంట్‌లు మాత్రమే కొనసాగితే అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేయవచ్చన్న సంకల్పంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఆశాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తమ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐలు డీసీ స్క్వాడ్, ఈఎస్ స్క్వాడ్‌లు తరుచూ ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు బార్ అండ్ రెస్టారెంట్‌లు, ఆర్ఎస్, డీఎస్, మిథనాల్, మొలాసిస్ తదితర యూనిట్లను తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అని ప్రభుత్వ దుకాణాల్లో డిజిటల్ పేమెంట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అక్రమ మద్యం, నాటుసారా తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి 08842376227 నెంబర్‌లో సమాచారం అందించి సహకరించాలని కోరారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు : ఎస్పీ

కాకినాడ క్రైం, మే 2: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బందికి ప్రజలు, ఉన్నతాధికారుల వద్ద ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. పోలీసుశాఖలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఎస్ఐలు కేఎస్ఎం కృష్ణ, ఎస్ఐ డి.చిరంజీవి, ఏఎస్ఐలు ఏఎస్వీఎస్ఆర్ రాజు, ఏఎస్ బాబూరావు, హెచ్‌సీ డి.సుబ్బరాజులను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. కాకినాడ జిల్లా పోలీసు పరిశీలకులుగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అధికారి డాక్టర్ సంజీవ్ ఎం.పాటిల్‌ను ఎన్నికల సంఘం నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా సంజీవ్ ఎం.పాటిల్ నెంబర్ 9949419654కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, మే 2: సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కేవీఏ విద్యుత్ ఫీడర్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా పట్టణమంతటా నిలిపివేయనున్నందున వినియోగదారులు సహకరించాలని ఈఈ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు.

కాకినాడను ఆదర్శ స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతాం

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి

కాకినాడ సిటీ, మే 2: కాకినాడ నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామని, నగర ప్రతిష్ఠను, గౌరవాన్ని పెంచే బాధ్యతను తీసుకుంటామని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ జగన్నాథపురంలోని పార్టీ కార్యాలయంలో కాకినాడ సిటీ నియోజకవర్గ మేనిఫెస్టోను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో శంకుస్థాపన చేసిన మూడో బ్రిడ్జిని మొదలుపెట్టి పూర్తి చేయించి 216 జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి కాకినాడకు రింగ్ రోడ్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. గతంలో తాను శంకుస్థాపన చేసిన ఎంఎస్ఎన్ చార్టీస్‌కు సంబంధించిన స్థలంలో క్రీడా మైదానాన్ని నిర్మించే బాధ్యత తీసుకుంటామన్నారు. వేసవి కాలంలో మంచినీటి సమస్యలేని కాకినాడ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానంగా నగరంలో ప్రజలపై, మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌ను పునరుద్ధరించి ప్రజల రక్షణ బాధ్యతను తీసుకుంటామన్నారు. వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణతో కలిసి 18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ నాయకులు బొద్దు శివాజీ, తుమ్మిడి అనిల్, జగతాని రాము, గంటపల్లి వెంకట గణేష్, మల్లాడి ప్రసాద్, గెరడా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.




నియోజకవర్గ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న వనమాడి.. 18వ డివిజన్‌లో పర్యటిస్తున్న వనమాడి, చిక్కాల



45వ డివిజన్‌లో వనమాడి మోహన్‌వర్మ ప్రచారం

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

స్థానిక 27వ డివిజన్ నుంచి ఎన్‌వీవీ నాగేశ్వరరావు(బుజ్జి) ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 500మంది మహిళలు, వనమాడి సమక్షంలో టీడీపీలో చేరారు. 41వ డివిజన్ నాయకుడు వాసంశెట్టి శ్రీనివాస్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. వారికి వనమాడి కండువాలు వేసి ఆహ్వానించారు. పలు డివిజన్ల నుంచి వచ్చిన యువకులు పార్టీలో చేరారు.

వనమాడి కుటుంబీకుల ప్రచారం

కొండబాబును సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కుమారులు, ఆయన అన్న కుమారుడు ప్రచారం సాగించారు. 45వ డివిజన్‌లో వనమాడి మోహన్ వర్మ, 46వ డివిజన్‌లో వనమాడి హేమంత్‌కుమార్, 33వ డివిజన్‌లో వనమాడి శివప్రసాద్, 13వ డివిజన్‌లో వనమాడి కొండబాబు కోడలు డాక్టర్ హనీష ప్రచారం నిర్వహించారు.



13వ డివిజన్‌లో కొండబాబు కోడలు హనీష ప్రచారం

'జేఎన్‌టీయూకే సేవలు అభినందనీయం'

జేఎన్‌టీయూకే, మే 2: ఆధునిక సాంకేతిక సంస్కరణలకు పెద్దపీట వేస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న జేఎన్‌టీయూకే సేవలు అభినందనీయమని ఎఫ్ఎస్ఎస్ఏఐ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ అజయ్‌ప్రకాశ్ గుప్తా అన్నారు. గురువారం జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన వీసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో అజయ్‌ప్రకాశ్ గుప్తా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్ సుజాత, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ హెడ్ పాల్గొన్నారు. గుప్తా మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ఆర్థిక సహకారంతో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీలో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీలో ఆహార నాణ్యతా పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ప్రయోగశాల విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గుర్తింపుతో ఉన్న ప్రయోగశాల కాకినాడ జేఎన్‌టీయూకేలోని ఫుడ్ టెస్టింగ్ లేబోరేటరీ అన్నారు. పోర్టులో దిగుమతి అవుతున్న ఆహార నమూనాలను ఇక్కడ విజయవంతంగా పరీక్షిస్తున్నట్లుతెలిపారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం. రమేష్, పలువురు డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించాలి'

కాకినాడ సిటీ, మే 2: రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్ కోరారు. రూరల్ నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను గ్లాసుగుర్తుపై ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా పావని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 1వ డివిజన్ గొల్లపేట, కాపుల వీధుల్లో ఆమె పర్యటించి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లను పంపిణీ చేశారు.

'పారదర్శకంగా విధుల నిర్వహణ'

సర్పవరం జంక్షన్, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొంటున్న సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. నివాస్ కోరారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో పోలింగ్ సిబ్బందికి గురువారం ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈవో ఇట్ల కిషోర్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో కలెక్టర్ తనిఖీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని జాతీయ రహదారిపై ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఎన్నికలకు సంబంధించి చెక్‌పోస్టును గురువారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె. నివాస్ తనిఖీ చేశారు. తనిఖీల వివరాలు, నమోదు చేసిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలపై ఎస్ఐను ఆరా తీశారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పీవో, ఏపీవోలకు నిర్వహించే శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రత్తిపాడు ఆర్వో ఎ.శ్రీనివాస్ ఉన్నారు.

జగ్గంపేట: స్థానిక డిగ్రీ కళాశాల నందు ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆర్వో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ లక్ష్మణరావుతో పాటు ఎన్నికల అధికారుల మధ్య ఈవీఎం బాక్సులు సీలు తెరిచి అభ్యర్థుల గుర్తులు అమర్చారు. సమస్యాత్మకమైన గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), మే 2: ఎన్నికల విధులపై పీవో, ఏపీవోలకు గురువారం శిక్షణ ఇచ్చారు. పీఆర్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి తొలిరోజు 250మంది హాజరయ్యారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి పీవో, ఏపీవోలకు సూచనలు ఇచ్చారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధులపై పీవో, ఏపీవోలు సమగ్రంగా అవగాహన చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులంతా వైసీపీని చిత్తుగా ఓడించాలి

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు



చొల్లంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దాట్ల

తాళ్లరేవు, మే 2: దళితులను బహిరంగంగా చంపేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీని ఎన్నికల్లో దళితులంతా ఓటు అనే ఆయుధంతో చిత్తుగా ఓడించాలని ముమ్మిడివరం టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం చొల్లంగిలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో చొల్లంగి ఎస్సీపేట, శివకోలని, సాల్ట్‌కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాట్ల మాట్లాడుతూ దళితుల మేనమామని చెప్పుకుంటున్న జగన్ దళితులపై దాడులు, హత్యలు చేశారన్నారు. దళితులు ఉన్నతస్థాయికి ఎదగకుండా 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. విదేశీవిద్యకు ఉన్న అంబేడ్కర్ పేరును తొలగించి జగన్ విదేశీ విద్యగా పేరుపెట్టుకోవడం అంబేడ్కర్‌ను అవమానించినట్టు దళితులకు అర్థంకావడం లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం తొలగించిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరించి దళితులను ధనవంతులను చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మేడపాటి దేవానందం, పులపకూర చినబాబు, గర్రే లక్ష్మీనారాయణ, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సుభాష్ సతీమణి లక్ష్మిసునీత

సుభాష్‌కు మద్దతుగా ప్రచారం

కాజులూరు, మే 2: మండలంలోని గొల్లపాలెంలో టీడీపీ కూటమి రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు మద్దతుగా ఆయన సతీమణి లక్ష్మిసునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి సుభాష్, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌కు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుబ్బల ఏసురాజు, చుండ్రు వీర్రాజు చౌదరి,అంగర శ్రీను, అంగర కృష్ణ, జనసేన నాయకులు తోట కృష్ణ, దేగల సతీష్, నాని, కుంచు స్తంభం బుజ్జి, వల్లు అర్జునరావు, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, సోవాలమ్మ, లక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు. మండలంలో పల్లెపాలెం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు బిళ్ళకుర్తి కృష్ణారెడ్డి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీ ప్రచార కమిటీ సభ్యుడి మార్పు

కాకినాడ సిటీ, మే 2: కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ శెట్టిబలిజ సామాజికవర్గ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా నియమితులైన చప్పిడి వెంకటేశ్వరరావుకు బదులుగా కొప్పిశెట్టి నాగేశ్వరరావును నియమిస్తూ కాకినాడ పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్ నియామక పత్రం జారీ చేశారు. కాకినాడ రూరల్‌కి చెందిన టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై సమావేశం

పెద్దాపురం, మే 2: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చులపై అవగాహన కలిగిఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఏ.ఆశీఫ్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఆయా పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఖర్చుల విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితం గా పాటించాలన్నారు. ఆర్వో జె.సీతారామారావు, లైజనింగ్ అధికారి మల్లిఖార్జునరావు, కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'సీఎం జగన్ మహానటుడు'

కొత్తపల్లి, మే 2: సీఎం జగన్ మంచి నటుడని, పచ్చి అబద్ధాన్ని కూడా నిజాయితీగా కళ్లకు కట్టినట్టు వినిపించే మహానటుడు అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. తాము డబ్బుల కోసం సినిమాల్లో నటిస్తామని కానీ జగన్ రాజకీయంగా నటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. కార్మికులు దాచుకున్న డబ్బును దొడ్డి దారిన లాగేసుకొన్న వైసీపీ ప్రభుత్వాన్ని తుంగలోకి తొక్కే రోజు ఆసన్నమైందన్నారు. సిగరెట్ తాగడం ఆరోగ్యానికి ఎంత హానికరమో, వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటేస్తే అంతే ప్రమాదమని గుర్తించాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, చల్లపల్లి శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మికుల ప్రతినిధి చీకట్ల సాంబశివ కుమార్ పాల్గొన్నారు. వాకతిప్ప మీదుగా కొత్తపల్లి వెళ్తున్న నాగబాబుకు ఎంఆర్పీఎస్ కొత్తపల్లి మండలాధ్యక్షులు మోర్త రవి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సమస్యలపై వినతి ఇచ్చారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

పిఠాపురం, మే 2: పిఠాపురం శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో వారం రోజులు పాటు నిర్వహించే తాత్విక బాల వికాస్ వేసవి శిక్షణా శిబిరాన్ని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ గుంటూరు వెంకట సీతారామ దీక్షితులు హుస్సేన్‌షాతో కలిసి గురువారం ప్రారంభించారు. పీఠాధిపతి డాకర్ ఉమర్‌ఆలీషా అంతర్జాలం ద్వారా సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో బాల వికాస్ సమన్వయకర్త ఏవీవీ సత్యనారాయణ, పేరూరి సూరిబాబు, బి.నాగేశ్వరరావు, అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, ఎన్‌టీవీ ప్రసాదవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

తొండంగి, మే 2: మండలంలోని ఏవినగరం గ్రామ సమీపంలోని లైఫస్ ఫార్మా కంపెనీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. కంపెనీ భవనంపై అంతస్తులో వెల్డింగ్ చేస్తుంగా నిప్పురవ్వలు దిగువనున్న ఫైబర్ వేస్ట్ మెటీరియల్ పై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భారీఎత్తున పొగ ఎగసిపడడంతో ఏమి జరిగిందో అర్థంకాక పరిసర ప్రజలు ఆందోళన చెందారు. కంపెనీ ఫైర్‌ఫైటర్స్ సాయంతో మంటలను అదుపు చేశారు. ఎటువంటి ఆస్తిప్రాణనష్టం జరగలేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

కూటమితోనే ప్రజలకు మంచి రోజులు

ఎన్నికల ప్రచారంలో జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 2: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ తననుగెలిపించాలని జగ్గంపేట మండలం నరేంద్రపట్నం, భావరం, కాండ్రేగుల, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాల్లో చైతన్య రథంపై ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజలకు మంచి రోజులు రావాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల తీవ్ర ఇబ్బందులు పడ్డారని మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు, గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, బుర్రి సత్తిబాబు, కంచి కృష్ణార్జున, కంచి మణిబాబు, నాగం వెంకటేశ్వరరావు, పదిలం రాంబాబు ఉన్నారు.

టీడీపీలో చేరికలు

గోకవరం టీడీపీ నాయకులు ఘాజింగం సత్తిబాబు ఇంటి వద్ద గోకవరం మండలం వెదురుపాక గ్రామ వైసీపీ నుంచి యూనిట్ ఇన్‌చార్జ్ పిల్లా అర్జున్ సారధి, గోకవరం మండల ఐటీడీపీ ఛాంపియన్ బత్తుల ఎస్.బాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన ఆకుల వెంకట్, గ్రామ1వ వార్డు మెంబర్ కొత్తపల్లి ప్రసాద్, గవరసాని వీరబాబు, షోడసాని సతీష్, సోడసాని బాబి, దోమడ శ్రీను, నాగారపు మణి, చేనుబోయిన అప్పా రావు, రవి, కోప్పాక శివ తదితరులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరగా ఆయన అభినందించారు. జగ్గంపేట మండలం కాండ్రేగులలో ఎన్నికల ప్రచారంలో నెహ్రూ వద్దకు వేలంక వైసీపీ ఎంపీటీసీ గుత్తుర్తి రమణ చేరుకుని ఆయన సమక్షంలో వైసీపీకి రాజీనామా చేసి చిట్నీడి ఈశ్వరుడుతో కలిసి టీడీపీలో చేరారు.

కిర్లంపూడి: మండలంలోని గోనేడ గ్రామంలో సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నీలం శ్రీను ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సమక్షంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ సమక్షంలో వేలంక ఎంపీటీసీ గుర్తుర్తి రమణ అనుచరులతో టీడీపీలో చేరారు. జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత, సర్వారాయుడు గోనేడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు తదితరులున్నారు.



నెహ్రూకు హారతులు పడుతున్న దృశ్యం



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న నెహ్రూ



కిర్లంపూడి: టీడీపీలో చేరిన వారితో నవీన్

ఉమ్మడి మేనిఫెస్టోతో వైసీపీకి వణుకు

కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ



సర్పవరం జంక్షన్: ఎన్నికల ప్రచారంలో పంతం నానాజీ



కరపలో ప్రచారం నిర్వహిస్తున్న అనంతలక్ష్మి, సందీప్

సర్పవరం జంక్షన్, మే 2: ఉమ్మడి మేనిఫెస్టోతో అధికార వైసీపీకి వణుకు పట్టుకుందని, సీఎం జగన్ అరాచక పాలనకు మద్దతు ఇచ్చి అధర్మం వైపు ఉంటారో.. చంద్రబాబు,పవన్‌ల కూటమికి మద్దతు ఇచ్చి ధర్మం వైపు ఉంటారో తేల్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కాకినాడ 1,2, 47,48,49,50వ డివిజన్లలో ఇంటింట ప్రచారం, వాహనంపై ర్యాలీగా ప్రచారం నిర్వహించి గాజు గ్లాసు గుర్తులపై ఓట్లేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని, ఎమ్మెల్యే కన్నబాబుకు డబ్బులు వచ్చే పనులు చేపట్టారని.. ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టలేదని ఆరోపించారు. కాకినాడ రూరల్ వలసపాకల గ్రామానికి చెందిన సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే కరపకు చెందిన వైసీపీ నాయకుడు స్వామినాయుడు తన అనుచరులతో కలసి జనసేనలో చేరారు.

నానాజీకి మద్దతుగా ప్రచారం

కరప: ప్రజాశీస్సులతో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు అన్నారు. పంతం నానాజీకి మద్దతుగా కుమారుడు పంతం సందీప్‌తో కలసి వారు కరపలో ఇంటింట ప్రచారం చేసి మేనిఫెస్టోపై ప్రజలకు వివరించి రాష్ట్ర భవిష్యత్తు, కోసం కూటమిబలపరచిన అభ్యర్థులను గెలపించాలని కోరారు.

పవన్, నానాజీ గెలవాలని...

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన మహిళలు ఎర్రంశెట్టి నీలవేణి, కొల్లి సంధ్య జనసేన ఆవిర్భావం నుంచి వీరమహిళలుగా పార్టీ కోసం కృషి చేస్తున్నారు. ఎన్నికల్లో పవన్ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా భారీ మెజారిటీతో విజయం సాధించాలని, కాకినాడ రూరల్ నుంచి కూటమి అభ్యర్థి పంతం నానాజీ విజయం సాధించాలని అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. కొండ కింద భాగం నుంచి సత్యనారాయణస్వామి కొలువై ఉన్న కొండపైకి మోకాళ్లపై మెట్లు ఎక్కి పవన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. వారిని జనసేన నాయకుడు పుల్ల శ్రీరాములు, భావనారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను (చైర్మన్) అభినందించారు.



అన్నవరంలో మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న నీలవేణి, సంధ్య

'కూటమి అభ్యర్థులను గెలిపించండి'

ఏలేశ్వరం, మే 2: కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ప్రచారం నిర్వహించారు. గురువారం తిరుమాలి గ్రామంలో ఇంటింటా తిరిగి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కి గాజుగ్లాసుపై, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని స్థానికులను అభ్యర్థించారు. కార్యక్రమంలో సూతి ప్రభాకర్, చందువోలు రాజా, యర్రంశెట్టి దుర్గాప్రసాద్, పలివెల వెంకటేష్, కోలా వీరబాబు, కానూరి బ్రహ్మానందం, బొట్టా సురేష్ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వరుపుల సత్యప్రభ విస్తృత ప్రచారం




శంఖవరం: ప్రజలకు మేనిఫెస్టో వివరిస్తున్న సత్యప్రభ, ప్రత్తిపాడు: వేళంగిలో టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 2: నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా గురువారం మండలంలోని పలు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. గిరిజన ప్రాంత ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా హారతులు ఇచ్చి పూలమాలలు వేసి సత్యప్రభకు మద్దతు తెలిపారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద బారుపాకకి చెందిన 20 వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వీరికి సత్యప్రభ పార్టీ కండువాలు వేశారు. అలాగే వేళంగిలో మరో 20 గిరిజన కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా సత్యప్రభ ఆహ్వానించారు. వేళంగిలో గ్రామ ఉపసర్పంచ్ రావుల జ్యోతి, ఎస్. వెంకన్న, సత్యవతి, చిన బ్బాయి. రాంబాబు, అన్నపూర్ణ, నాగేశ్వరరావులు పార్టీలో చేరారు.

సాయి తర్షిత్,ఇంద్రనీల్ ప్రచారం

పోతులూరులో వరుపుల సత్యప్రభ రాజా తనయుడు సాయి తర్షిత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంచి తన తల్లి వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్‌ను గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. సత్యప్రభ ఆడపడుచు కల్యాన పోతులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, టీడీపీ నాయకులు కొమ్మల కన్నబాబు, అమరాది వెంకట్రావు, పల్లా గోపి పాల్గొన్నారు. చినశంకర్లపూడి గ్రామంలో టీడీపీ వలంటీర్లు ప్రచారం నిర్వహించారు. ఉత్తరకంచిలో గురువారం రాత్రి బుల్లితెర నటుడు ఇంద్రనీల్ వర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులు సత్యప్రభ, ఉదయశ్రీనివాస్‌లకు విజయం చేకూరాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ(శ్రీను), టీడీపీ నాయకులు ఇళ్ళ అప్పారావు, బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, గున్నాబత్తుల వీరబాబు పాల్గొన్నారు.

శంఖవరం: ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ మండలంలోని పెదమాల్లాపురం, వేళంగి, మండపం, అన్నవరం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పర్వత సురేష్, టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, పోలం చిన్నా, పాకల ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: పోతులూరులో సాయి తర్షిత్ ఎన్నికల ప్రచారం

'నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు'

తొండంగి, మే 2: యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకుగాను నియోజకవర్గ పరిధిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి తుని అభ్యర్థి యనమల దివ్య అన్నారు. గురువారం కొత్త ముసలయ్యపేట, అన్నయ్యపేట గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచి వివరించారు. కార్యక్రమంలో యనమల నాగేశ్వరావు, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, చొక్కా కాశీ, చోడిశెట్టి గణేష్, బెండపూడి నాయుడు , సాధనాల నూకరాజు, అరిగెల నర్సింహమూర్తి తదితరులున్నారు.

'కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలి'

కాకినాడ సిటీ, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు మాదిగ, మాదిగ ఉపకులాలు సహకరించాలని మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు పిలుపునిచ్చారు. కాకినాడ కాస్మో పోలిటన్ క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఆర్‌జే ప్రకాష్, మాదిగ దండోరా వ్యవస్థాపకుడు పొన్నగంటి రమేష్, జైమాదిగ సేవా సంఘం వ్యవస్థాపకుడు కొదమల బెంజిమెన్, ముప్పిడి దైవ వరప్రసాద్ ఏఐఎండీఎస్ వ్యవస్థాపకుడు కాపవరపు కుమార్ మాట్లాడారు.